క్లుప్తంగా

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ఆదోనిఅర్బన్: లయన్స్ క్లబ్, అవోపా ఆధ్వర్యంలో ఆదోని నోబుల్ వొకేషనల్ కాలేజీ ఆవరణలో మంగళవారం క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి సంవత్సరం నవంబర్ 7వ తేదీన క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. క్యాన్సర్‌ను ముందుగానే ఎలా గుర్తించాలి, తొందరగా ఎలా బయటపడాలనే విషయాలను డాక్టర్లు వివరించారు. దాదాపు 250 మందికి అవగాహన కల్పించారు. ఆదోని నోబుల్ వొకేషనల్ కాలేజ్ కరెస్పాండెంట్ దేవదానం, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, రీజియన్ చైర్మన్ ప్రసాదరావు, వన్నప్పరాజు, అవోపా అధ్యక్షులు శ్రీనాథ్‌గుప్తా, మహిళా విభాగ్ అధ్యక్షులు మమత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలోని క్షయవ్యాధిగ్రస్తులకు మంగళవారం ఆర్‌టీపీసీఆర్ ల్యాబ్ వద్ద పౌష్టికాహార కిట్లను డాక్టర్ షేకున్‌భాను, ఎంపీహెచ్‌ఎస్ బాబురాజు చేతులమీదుగా పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్ 10 మంది వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారు. వారి ఆరోగ్యం కుదుటపడేంత వరకు వారికి పౌష్టికాహారం అందజేయనున్నట్లు డాక్టర్ షేకున్‌భాను తెలిపారు. రూ.వెయ్యి విలువచేసే నెల రోజులకు సరిపడే నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే మందులను క్రమంతప్పకుండా ఆరునెలలపాటు వాడడం ద్వారా వ్యాధి నుంచి బయటపడవచ్చని డాక్టర్ షేకున్‌భాను తెలిపారు. ఎంపీహెచ్ఎస్‌లు లలితమ్మ, సూపర్‌వైజర్ సుబ్బమ్మబాయి, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రమాదాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్టీఓ సిసిరాదీప్తి

ఆదోనిసెంట్రల్: అతివేగం ప్రమాదకరమని, నిదానమే ప్రధానమని ఆదోని ఆర్టీఓ సిసిరాదీప్తి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆదోని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు బెస్త జయసూర్య, ప్రధాన కార్యదర్శి బల్లేకల్లు సూర్య, నూర్ ఆధ్వర్యంలో ఆదోని సాయి జూనియర్ కళాశాలలో 'ఓ యువత అతివేగం ప్రమాదకరం' పేరిట అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్టీఓ సిసిరాదీప్తి, ట్రాఫిక్ సీఐ పార్థసారథి, టీఎన్ఎస్ఎఫ్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ.. విద్యార్థులు బైకులను కొనివ్వమని తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. బైకుపై ప్రయాణించే వారు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు దరిచేరవన్నారు. బైక్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు తుకారాం, విజయ్, శశి, శివవర్మ, పవన్, విశ్వం, శివ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కోసిగి: తల్లీబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోసిగి కుమ్మరి వీధి పీర్ల చావిడి సమీపంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద గర్భిణులు, బాలింతలకు ఎంపీపీ ఈరన్న, అంగన్‌వాడీ కార్యకర్తల సమక్షంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తల్లీబిడ్డల క్షేమం కోసం సంపూర్ణ పోషణ అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరు ఉపయోగించుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, హాజి ఉస్మాన్, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

కోసిగి: మండల కేంద్రంలోని ఆదిఆంధ్ర, హిందూ గరల్స్ ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను మండల విద్యాధికారి-2 నాగేశప్ప తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం, నాడు-నేడు పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా చేసేలా చూడాలని ఏఈ రంగరాజుకు సూచించారు. అలాగే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. సీఆర్‌పీ యోహన్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, డీటీపీ వీరేంద్ర వెంట ఉన్నారు.

రైతన్నకు బాసటగా భరోసా

- నియోజకవర్గంలో 45,209 మందికి పెట్టుబడి సాయం
- రూ. 18.08 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఆనందంలో రైతన్నలు



మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయం పండగలా మారింది. దండగ అన్న టీడీపీ నేతల నోళ్లు మూతబడ్డాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న పథకాలు రైతుల ఇంట కాంతులు నింపుతున్నాయి. పంటల సాగుకు పెట్టుబడి సాయం అందుతుండడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఖరీఫ్, రబీ సీజన్ల ఆరంభంలోనే రైతు భరోసా నిధులు మంజూరు చేయడంతో పెట్టుబడులకు ఉపశమనం లభిస్తోంది. మంగళవారం ఐదో ఏడాది రెండవ విడత రైతు భరోసా సాయం విడుదల చేశారు. నియోజకవర్గంలో మొత్తం 45,209 మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేశారు. నియోజకవర్గంలో రూ.1.97 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. పెట్టుబడి సాయం కింద 45,209 మందికి గానూ రూ.18,08,36,000 నగదు మంజూరైంది. రైతుల ఖాతాలో రూ.4 వేలు చొప్పున జమ చేశారు.

రైతు భరోసా సాయం వివరాలు

మండలం	యజమాన్య రైతులు	కౌలు రైతులు	దేవదాయ కౌలు రైతులు	సాయం
మంత్రాలయం	8802	175	--	రూ.3,59,08,000
కౌతాళం	15366	462	8	రూ.6,33,44,000
పెద్దకడుబూరు	10094	269	4	రూ.4,14,68,000
కోసిగి	9911	112	6	రూ.4,01,16,000
మొత్తం	44,173	1,018	18	రూ.18,08,36,000

కౌలు రైతులకు అండ

భూ యాజమాన్య రైతులకే గాకుండా ప్రస్తుత ప్రభుత్వం కౌలు రైతులకు అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం యాజమాన్య రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నిధులు మంజూరు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కౌలు రైతులకు సైతం పెట్టుబడి సాయం అందజేస్తోంది. నియోజకవర్గంలో 1,018 మంది కౌలు రైతులకు రూ.40.72 లక్షలు మంజూరైంది. అలాగే దేవదాయ శాఖ భూములను కౌలుకు చేస్తున్న 18 మందికిగానూ రూ.72 వేలు విడుదలయ్యాయి. సకాలంలో పెట్టుబడి సాయం అందించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడులకు ఆసరా



రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏటా రబీ, ఖరీఫ్ సీజన్లలో పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ చేయడం సంతోషకరంగా ఉంది. గతంలో పెట్టుబడుల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసే వాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. రైతుల కోసం సీఎం జగనన్న చేస్తున్న మేలు మరువలేం.

– లక్ష్మిరెడ్డి, సూగూరు

సంతోషంగా ఉంది



రైతుల కష్టాలను తెలిసిన నాయకుడు సీఎం కావడం అదృష్టం, రైతుల గురించి గతంలో ఏ పాలకుడు పట్టించుకునే వారు కాదు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక రైతుల సంక్షేమం కోసం ఎనలేని సంక్షేమ పథకాలు, సబ్సిడీ పరికరాలు, యంత్రాలు అందించారు. అలాగే మాట తప్పకుండా పెట్టుబడి సాయం అందించి రైతుల కష్టాలు తీరుస్తున్నాడు. ఇలాంటి నాయకుడు సీఎం కావడం చాలా సంతోషకరంగా ఉంది.

– భీమన్న, అగసనూరు

శ్రీమఠానికి వెండి సామగ్రి విరాళం



మేనేజర్ శ్రీనివాసరావుకు వెండిని అందజేస్తున్న దాతలు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి హైదరాబాద్‌కు చెందిన సంజయ్ ప్రసాద్ అనే భక్తుడు వెండి సామగ్రిని విరాళంగా అందజేశారు. మంగళవారం శ్రీమఠం మేనేజర్ శ్రీనివాస రావుకు ఒక వెండి చెంబు, వెండి ప్లేటు, 21 లక్ష్మీ ప్రతిమ బంగారు నాణెలు (24 గ్రాములు) కానుకగా ఇచ్చారు. దాతలకు శేషవస్త్రం, పరిమళ ప్రసాదం, ఫలమంత్రాక్షింతలు అందజేశారు.

గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కోసిగి: జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ద్వారానే డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఏపీ డప్పు కళాకారుల సంఘం కార్యదర్శి రామకోటి హనుమంతు కోరారు. మంగళవారం మండలంలోని సజ్జలగుడ్డం, జంపాపురం, సాతనూరు, చిన్నభూంపల్లి గ్రామాల్లో సచివాలయాల ఎదుట డప్పులను వాయిస్తూ ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయా సచివాలయాల్లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. డప్పు కళాకారులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో ప్రత్యేక పూజలు



శ్రీమఠం ముంగిట సుబ్బారావు, సిబ్బంది

మంత్రాలయం: శ్రీరాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మున్సిపల్ పరిపాలన శాఖ రీజినల్ డైరెక్టర్ సుబ్బారావు (ఐఏఎస్ అధికారి) మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని రాఘవేంద్రుల మూల బృందావనంను దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఎస్ఐ వేణుగోపాల్ రాజు ఉన్నారు.

దేశానికే ఆదర్శంగా జగనన్న పాలన

కోసిగి: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన సాగిస్తూ పేదల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. మంగళవారం కోసిగి సచివాలయం-4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డితో కలిసి ఆయన పర్యటించారు. ఆ సచివాలయం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ పరిపాలన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ప్రతి ఇంటికి అర్హతే ప్రామాణికంగా, కుల మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి అర్హుడికి సంక్షేమ పథకం అందజేయడంలో తమ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న సంక్షేమ పాలన పట్ల పేదలందరూ సంతోషం వ్యక్తపరుస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గ ప్రజల కోసం శాయశక్తులా శ్రమిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలే కాకుండా గ్రామాలాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. కోసిగిలో పేదలకు ఇళ్లు మంజూరు చేయడంలో హౌసింగ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానిక నాయకులు ఆరోపించారు. వెంటనే హౌసింగ్ ఏఈ శేఖర్ బాబును విచారించి అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, ఇల్లూరి ఆదినారాయణ, శ్రీనివాస రెడ్డి, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, ఎంపీపీ ఈరన్న, సర్పంచ్ అయ్యమ్మ, నాయకులు మహంతేష్ స్వామి, మాణిక్యరాజు, నాగరాజు, నరసింహులు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఇస్వీలో ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ఆదోనిరూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం అని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ఇస్వీ గ్రామంలో సోమవారం ఎంపీడీఓ గీతావాణి ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకూ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 145 గడపలను సందర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి ఇంటికీ రూ.3 లక్షల మేర లబ్ధి చేకూరిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువైందని వివరించారు. సచివాలయం నిధులు రూ.20 లక్షలతో డ్రెయినేజీ కాలువలు, సీసీ రోడ్ల పనులకు ఎస్టిమేషన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో రెండు సచివాలయ నిర్మాణ పనులు, రెండు రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. జలజీవన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ దేవిశెట్టి మంజుల, ఎంపీడీఓ గీతావాణి, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఈఓపీఆర్‌డీ జనార్ధన్, హౌసింగ్ బోర్డు అధికారి తిప్పన్న, సర్పంచ్ శ్యామలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీలక్ష్మి, చంద్రకాంత్‌రెడ్డి, కల్పవల్లి, భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయండి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోనిరూరల్: ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించి అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులకు తెలియజేయవచ్చని ఆదోని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. మంగళవారం ఉదయం సబ్‌కలెక్టర్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల ప్రతినిధులు ముసాయిదా ఓటర్ల జాబితాను పరిశీలించి, అందులో ఏమైనా తప్పులు, పొరపాట్లు జరిగి ఉంటే సంబంధిత ఏఈఆర్ఓ, ఈఆర్వో, బీఎల్ఓ లేదా ఆదోని ఎన్నికల అధికారికి సంబంధిత ఫారంతో డిసెంబర్ 9వ తేదీలోపు అందజేయాలన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటుహక్కు ఉండాలని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. చనిపోయిన లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి మారిన వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలని కోరారు. పై సవరణలన్నీ పూర్తయిన తర్వాత ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా వచ్చే జనవరి 5వ తేదీన ఓటర్ల జాబితా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. పోలింగ్‌స్టేషన్ల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులు గమనించిన సమస్యలను ఆదోని ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రూట్ ఆఫీసర్లతో సమీక్ష

సెక్టర్, రూట్ ఆఫీసర్లతో సబ్‌కలెక్టర్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ..ఆదోని నియోజకవర్గంలో 25 మంది రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందన్నారు. ఇందులో 1 నుంచి 9 వరకు రూరల్ రూట్స్, 10 నుంచి 25 వరకు అర్బన్ రూట్స్ ఉన్నాయని, రూట్ ఆఫీసర్‌గా నియమితులైన ప్రతిఒక్కరూ ఆయా రూట్స్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం విద్యుత్, తాగునీరు, టాయిలెట్స్, రూఫ్ తదితర సదుపాయాలు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఉప తహసీల్దార్‌లు రజనీకాంత్‌రెడ్డి, ఇజాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

ఆదోనిరూరల్: దీపావళి పండగ సందర్భంగా బాణసంచా స్టాల్స్ ఏర్పాటు చేసుకునే వారు ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని బాణసంచా వ్యాపారులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి స్టాల్ వద్ద డ్రమ్ముల్లో నీటిని అందుబాటులో ఉంచుకోవాలని, ఇసుక నింపిన బకెట్లు ఉంచాలని, దుకాణాల మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండేలా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రేకుల షెడ్‌లలో మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేయాలని, ఐఎస్ఐ స్టాండర్డ్‌తో ఉన్న బాణసంచా మాత్రమే విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. స్టాల్స్ వద్ద అగ్నిమాపక వాహనం, అంబులెన్స్ అంబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. బాణసంచా విక్రయాలకు ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు మాత్రమే అనుమతిస్తామని 15న మధ్యాహ్నం లోపు స్టాల్స్ తొలగించాలని వ్యాపారులకు సూచించారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌నాయక్, అగ్నిమాపక అధికారి జి.రామాంజనేయులు, మున్సిపల్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

ఆదోనిటౌన్: ఆదోని పట్టణ పరిశుభ్రత, ప్రజారోగ్యమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. పట్టణంలో రోజూ లభ్యమయ్యే చెత్తాచెదారాన్ని తొలగించేందుకు వీలుగా మరికొన్ని తోపుడుబండ్లను తెప్పించడం జరిగిందన్నారు. మంగళవారం ఆదోని మున్సిపాలిటీకి మంజూరైన 20 తోపుడు బండ్లను ఆయన పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, మంజునాథ్, శ్రీనివాసులు, మేస్త్రీలతో ఆయన మాట్లాడారు. ఏయే వార్డులకు తోపుడుబండ్లు రిపేరీలో ఉన్నాయో ఆయా వార్డులకు కొత్త తోపుడు బండ్లను పంపిణీ చేసి వీధులను శుభ్రంగా ఉంచేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల పట్ల కార్మికులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. స్వచ్ఛ ఆదోనిగా తీర్చిదిద్దడమే తమ కర్తవ్యమని చెప్పారు.



కొత్తగా మంజూరైన తోపుడు బండ్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి గణేష్ అండర్-17 జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అలీంసిద్ధిఖీ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో అండమాన్ నికోబార్‌లో జరిగే క్రీడా పోటీల్లో గణేష్ పాల్గొంటున్నట్లు చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఆదోనిరూరల్: మండలంలోని ఉవ్వనూరు గ్రామానికి చెందిన పింజరి చిన్నస్వామి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆదోని తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి మంగళవారం విలేకరులకు తెలిపారు. మృతుడి భార్య ఉసేనమ్మ ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 4వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో చిన్నస్వామి బహిర్భూమికి బయటకు వెళ్లాడు. తిరిగి వచ్చి ఇంట్లో పడుకొని అస్వస్థతకు గురయ్యాడు. కుమారుడు ఉసేన్‌బాషా ఆటోలో ఆదోనిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స నుంచి కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి భార్య ఉసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మంత్రాలయం: మంత్రాలయం మండల పరిధిలోని తుంగభద్ర రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంత్రాలయం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలోని 534/41 వద్ద రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందని రైల్వే ఎస్ఐ రామస్వామి తెలిపారు. మృతుడు నెల్లూరు జిల్లా కొత్తూరుకు చెందిన జొల్లు మల్లేష్ (55)గా తెలిసిందని రైల్వే పోలీసులు వెల్లడించారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం

ఆదోనిటౌన్: పట్టణాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశా రు. ఆదోనిలో మురికివాడలు, శివారు ప్రాంతాలతో పాటు గల్లీ వీధుల్లోనూ సీసీ రోడ్లు, మురుగు కాలువలు ఏర్పాటు చేయడమే ఎమ్మెల్యే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 13, 14 వార్డుల పరిధిలో పర్యటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, కౌన్సిలర్లు సికిందర్, రహిమాన్, పట్టణాధ్యక్షుడు దేవాతో పాటు వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు గడప గడపకు కలియతిరిగారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



మార్కండేయ స్వామి ఆలయ ఏరియాలో ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మనోజ్

ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలను వివరిస్తూ ముందుకుసాగారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని చైర్‌పర్సన్ తెలిపారు. అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు కొనియాడారు. నాయకులు సన్ని, శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు రాజేశ్వర్‌రెడ్డి, నకతే శ్యామ్, చలపతి, బాలాజీయాదవ్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కౌతాళం: రైతులు సహకార బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డు ఫైనాన్షియల్ లిటరసీ సెంటర్ కౌన్సిలర్ బసవరాజు, ఆదోని కేడీసీసీ బ్యాంకు మేనేజర్ మహబుబ్ బాషా సూచించారు. కౌతాళం సహకార కార్యాలయం వద్ద మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.. వారు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సహకార సమైక్య డిపాజిట్ల ద్వారా సేవింగ్, కరెంట్ అకౌంట్లు, సున్నా బ్యాలెన్స్ అకౌంట్లను చేయించడంతో పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం వల్ల ఉచిత ప్రీమియంతో బీమా పొందే అవకాశం ఉందని వివరించారు. వచ్చే ఏడాది జనవరి 30 వరకు ఈ అవకాశం ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆదోని సూపర్‌వైజర్ విజయ్‌భాస్కర్, సంఘం అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, కౌతాళం సీఈఓ వెంకటేష్, నాయకులు సుబ్బారాజు, సహకారం బ్యాంకు సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బసవరాజు

నరసింహయ్య సేవలు మరువలేనివి

ఆదోనిరూరల్: ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసి అశువులుబాసిన నరసింహయ్య సేవలు మరువలేనివని, ఆయన మరణం తీరని లోటని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలుగు రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఢణాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ ఈరన్నగౌడ్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించిన కామ్రేడ్ నరసింహయ్య స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా విమలక్క పాల్గొని స్థూపాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నరసింహయ్య నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు సాగిస్తూ ఎన్నో త్యాగాలు చేశారని, ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈరన్నగౌడ్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నరసింహయ్య స్థూపాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించడం హర్షణీయమని కొనియాడారు. నాయకులు గంగన్న, వీరేష్, వెంకటేష్, హనుమయ్య, మహేష్, శారద, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న విమలక్క